సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 18 । జూన్ । 2023



'వండర్'ఫుల్ రికార్డులు 8లో▸

విభిన్నమైన.. ప్రత్యేకమైన అంశాలను ఎంచుకుని రికార్డు సృష్టిస్తున్నారు. కృషి, పట్టుదల, నిరంతర సాధనతో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంటున్నారు.

నేటి నుంచి ఆర్టీసీలో టీ9 టికెట్లు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీలో ఈ నెల 18 నుంచి టీ9 టికెట్ ప్రవేశపెడుతున్నట్లు మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. టీ9 టికెట్‌తో మహిళలు, వృద్ధులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు 60 కిలోమీటర్ల లోపు ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. టీ9 టికెట్ ధర రూ.100 కండక్టర్ వద్ద చెల్లించాల్సి ఉంటుందని, దీనివల్ల రూ.20నుంచి రూ.40వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
42.0 /32.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పడమర దిశగా వడగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

మంచిర్యాలఅర్బన్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో టీచర్ల నియామకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పొరుగు సేవల పద్ధతిన కాంట్రాక్టు ఉద్యోగులను నియమించాలని విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లాలో 18 కేజీబీవీల్లో 25 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల కేజీబీవీల్లో బదిలీల ప్రక్రియ చేపట్టడం.. ఇంటర్ ప్రవేశపెట్టిన చోట ఆయా ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ కొలువులకు ఎంపిక కావడంతో కొన్ని చోట్ల పోస్టులు అలానే ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నెల 26నుంచి జూలై 5వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఖాళీల వివరాలను డీఈవో యాదయ్య వెల్లడించారు.

ఖాళీలు ఇలా..

జిల్లాలో 18కేజీబీవీలున్నాయి. సీఆర్‌టీలు 6, పీజీసీఆర్‌టీలు 16, పీఈటీ 1, స్పెషల్ ఆఫీసర్లు 2 ఖాళీలున్నాయి. సీఆర్‌టీ పోస్టుల్లో ఇంగ్లిష్ 2, ఫిజికల్ సైన్స్ 2, బయోసైన్స్ 1, సోషల్ 1, పీఈటీ 1, పీజీసీఆర్‌టీల్లో ఉర్దూ 1, గణితం 1, ఫిజికల్ సైన్స్ 1, కెమిస్ట్రీ 1, బోటనీ 1, జువాలజీ 1, కామర్స్ 1, ఎకానామిక్స్ 2, సివిక్స్ 1 భర్తీ చేయనున్నారు. రాత పరీక్ష ఆధారంగా నియామకం జరుగనుంది.

12మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో సహా 11మంది ఉపాధ్యాయులకు డీఈవో యాదయ్య షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఎంఈవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలను సాయంత్రం 4:45 గంటలకు మూసివేయాల్సి ఉండగా, గత మూడు రోజులుగా 3:30 గంటలకే మూసివేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

చైన్ చోరీ చేస్తూ పట్టుబడిన కానిస్టేబుల్

మంచిర్యాలక్రైం: దొంగలు, అక్రమార్కుల గుండెల్లో సింహస్వప్నం కావాల్సిన కానిస్టేబుల్ చైన్‌స్నాచింగ్‌లతో కొత్త అవతారమెత్తాడు. పోలీసే దొంగతనాలకు పాల్పడితే ఇక ప్రజలకు రక్షణ ఎక్కడిది..? రక్షణ కల్పించాల్సిన ఓ కానిస్టేబుల్ మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఈ నెల 15న ఓ మహిళా ప్రయాణికురాలి మెడలో నుంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎంబడి బానేష్ ఈ నెల 15న ఒకసారి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి తప్పించుకున్నాడు. అదేరోజు మరోసారి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతుండగా జీఆర్‌పీ పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. అదుపులోకి తీసుకుని రెండు చైన్‌స్నాచింగ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం ఖాజీపేట రైల్వే కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని జీఆర్‌పీ పోలీసులు రహస్యంగా ఉంచడం విమర్శలకు తావిస్తోంది. కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో బానేష్‌పై గతంలో సైతం వసూల్ రాజాగా పేరుంది. స్టేషన్‌కు ఎవరు ఏ పనిపై వెళ్లిన బానేష్ ద్వారానే పని అవుతుందని, అడిగినంత ముట్టజెప్పుతే చాలు పని అయిపోయినట్లేననే ఆరోపణలు ఉన్నాయి. కోటపెల్లి ఎస్సై వెంకట్‌ను సంప్రదించగా.. తమ దృష్టికి వచ్చిందని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

351 మంది విద్యార్థుల సర్టిఫికేట్ల పరిశీలన




గదిలో వేచి చూస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండో రోజు శనివారం కొనసాగింది. పాలిసెట్ ర్యాంకు ప్రాతిపదికన స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో 351 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

కనిపించే దైవం.. నాన్న..!

నేడు ఫాదర్స్ డే



కిడ్నీ దాత.. తండ్రి



కిడ్నీ దానం చేసిన తండ్రి నర్సింగం

బెల్లంపల్లి: శరీర అవయవాల్లో కిడ్నీలు అత్యంత ముఖ్యమైనవి. అవిశ్రాంతంగా రక్తం శుద్ధి చేయడంలో కీలకంగా పని చేస్తాయి. వాటి పనితీరు మందగించినా.. పాడైనా ప్రాణాపాయ స్థితిలో పడినట్లే. కొడుకు రెండు కిడ్నీలూ పాడై పోవడంతో తండ్రి తన కిడ్నీ దానం చేసి ప్రాణాపాయం నుంచి తప్పించి పునర్జన్మ ప్రసాదించాడు. బెల్లంపల్లి పట్టణంలోని అశోక్ నగర్ బస్తీకి చెందిన సివిల్ కాంట్రాక్టర్ సిలివేరి నర్సింగంకు ముగ్గురు కుమారులు, కూతురు సంతానం. వీరిలో మూడో సంతానం నరేంద్రకు కిడ్నీల సమస్య ఏర్పడింది. ఉన్నత విద్య కోసం ఆస్ట్రేలియా దేశానికి వెళ్లిన అతడికి అనారోగ్య సమస్యలు తలెత్తాయి. రెండు కిడ్నీలూ పాడైపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. స్వదేశంలోని ఆస్పత్రుల్లో చూపించగా కిడ్నీ మార్పిడి చేయకపోతే ప్రాణాపాయమని సూచించారు. అలాంటి విపత్కర పరిస్థితుల్లో కొడుకు నరేంద్రపై ఉన్న ప్రేమతో తన కిడ్నీ దానం చేసి బతికించాలని ముందుకొచ్చాడు. తండ్రీకొడుకులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు కిడ్నీ సరిపోతుందని నిర్ధారించారు. దీంతో సరిగ్గా 22ఏళ్ల క్రితం నరేంద్రకు తన తండ్రి నర్సింగం కిడ్నీ దానిచ్చి ప్రాణాలు నిలబెట్టాడు. ప్రస్తుతం నరేంద్రకు కుమారుడు (18), కూతురు(13) ఉన్నారు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడంతో ఇప్పటివరకు తండ్రీకొడుకులకు అనారోగ్య సమస్యలు తలెత్తలేదు. ''నా కిడ్నీని కొడుకు అమర్చి ప్రాణాపాయం నుంచి కాపాడుకోవడం కన్నా ఆనందం ఇంకేముంటుంది..'' అంటూ నర్సింగం ఆనందం వ్యక్తం చేశాడు. ఇదే కదా రక్త సంబంధం అంటే.

నా రోల్ మోడల్



చెన్నూర్: నాకు ఊహ తెలిసిన దగ్గర నుంచి నా చదువు, ఉద్యోగం వచ్చే వరకు అన్నీ తానై ముందుండి నడిపాడు. మాది అప్పటి ఖమ్మం జిల్లా వైరా గ్రామం. నా తండ్రి సుబ్బయ్య. 1998లో నేను డిగ్రీ పూర్తి చేశాను. పీజీకి సిద్ధమవుతుండగా పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. మా నాన్న పోలీసు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోమని చెప్పాడు. సివిల్ ఎస్సై కోసం శ్రమించా ను. ఆర్ఎస్సై వచ్చింది. నాకు సివిల్ చేయాలని ఉంది. ఆర్ఎస్సై చేస్తూ సివిల్‌కు ప్రయత్నించమని చెప్పాడు. ఉద్యోగం చేస్తూ సివిల్‌కు ట్రై చేశా. 2004లో సివిల్ ఎస్సైగా ఎంపిక అయ్యాను. ఇతరులకు ఎలాంటి హాని చేయొద్దని, తోచినకాడికి సహాయం చేయాలయని, ఇతరుల నుంచి ఏదీ ఆశించవద్దని చెప్పేవాడు. అందుకే మా నాన్నే నా రోల్ మోడల్.

– సీఐ వాసుదేవరావు, చెన్నూర్

స్ఫూర్తితోనే డాక్టర్ అయ్యాను..



దండేపల్లి: మాది దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామం. నేను డాక్టర్ కావడానికి మా నాన్న జలపతినాయక్ స్ఫూర్తి. చిన్నప్పుడు నాన్నతో కలిసి వెళ్లేవాడిని. ఆ సమయంలో నాన్న రోగులకు వైద్య పరీక్షలు, చికిత్స చేయడం అన్నీ చూసేవాడిని. నేను కూడా పెద్దయ్యాక డాక్టరై రోగులకు సేవ చేయాలని అనుకున్నాను. డాక్టర్ కావాలనేది లక్ష్యంగా ఎంచుకుని ఎంబీబీఎస్ పూర్తి చేశాను. 2008–10 వరకు కాంట్రాక్టు పద్ధతిలో వైద్యుడిగా పని చేశాను. 2011–2021 వరకు ప్రభుత్వ వైద్యుడిగా, ఉమ్మడి జిల్లాలోని పలు పీహెచ్‌సీల్లో పనిచేశాను. మా నాన్న పనిచేసిన దండేపల్లి పీహెచ్‌సీలో నేను కూడా విధులు నిర్వర్తించడం మరిచిపోలేని అనుభూతి. రేడియాలజీలో పీజీ చేసి ప్రస్తుతం మంచిర్యాల మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, జిల్లా ప్రధాన ఆసుపత్రితోపాటు మాతాశిశు కేంద్రంలో రేడియాలజీగా పనిచేస్తున్నాను.

– డాక్టర్ దేవేందర్‌నాయక్, ఎండీ, రేడియాలజిస్టు

నాన్నను చూసి డాక్టర్ చదివి..



తల్లిదండ్రులతో ఆడె రియా

మంచిర్యాలటౌన్: నాన్న డాక్టర్ అరవింద్ ప్రభుత్వ వైద్యుడిగా మారుమూల ప్రాంతాల్లోని పేదలకు సేవలందించడం చూసి డాక్టర్ చదవాలని చిన్నప్పుడే అనుకున్నాను. ఆర్థో వైద్యుడిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలను ప్రారంభించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్యుడిగా పనిచేశారు. అమ్మ నూతన్ గైనకాలజిస్టుగా వైద్యం అందిస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులే కావడంతో చిన్ననాటి నుంచే వైద్యురాలిగా ప్రజలకు వైద్య సేవలు అందించాలని నిర్ణయించుకున్నాను. ప్రస్తుతం నాన్న వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ ఆసుపత్రుల సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత ఏడాది ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని హౌజ్‌సర్జన్ చేస్తున్నాను. మరో నెల రోజుల్లో హౌజ్ సర్జన్ పూర్తి చేసుకుంటాను. పీడియాట్రిషియన్‌గా గానీ, ఐ స్పెషలిస్టుగా ఎంఎస్ పూర్తి చేసి మా నాన్న మాదిరిగా ప్రజలకు వైద్యసేవలు అందిస్తాను.

– ఆడె రియా, హౌజ్ సర్జన్

నా మొదటి గురువు



పాతమంచిర్యాల: మా కుటుంబంలో ఐదుగురు సంతానం. నేను మొదటి వాడిని. నా తర్వాత అందరూ చెల్లెల్లే. మా నాన్న కనపర్తి జానకీరాములు ఆదిలాబాద్, వరంగల్‌లో డిగ్రీ కళాశాల ఉపన్యాసకులుగా పని చేసి విరమణ పొందారు. మా నాన్నకు నాకు చాలా అనుబంధం ఉండేది. అన్ని విషయాల్లో ముందుండాలని ప్రోత్సహించేవారు. నేను నాలుగో తరగతి వరకు పాఠశాలకు వెళ్లకుండానే ఇంటి వద్దనే చదువు చెప్పి ఆ తర్వాత బడిలో చేర్పించారు. డాక్టర్ చేయాలని కలలు కని ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లో చేర్చారు. పరిస్థితుల కారణంగా వైద్య విద్య చదవడం కుదరలేదు. అయినప్పటికీ డిగ్రీ, పీజీ వరకు పట్టుదలతో చదివించారు. పోటీ పరీక్షలకు హాజరు కావాలని పట్టుబట్టి చదివించడంతో ఈ స్థాయిలో ఉన్నాను.

– కే.విశ్వేశ్వర్, జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి(ఇంచార్జి), మంచిర్యాల

ప్రోత్సాహంతోనే సాధించాను..



తండ్రి పుండరిక్ ఉప్రేతో జ్యోత్స్న

లక్సెట్టిపేట: నాన్న ప్రోత్సాహంతోనే అన్నీ సాధించాను. నాన్న నా చిన్నప్పటి నుంచి స్నేహితుడిలా సలహాలు, సూచనలు ఇవ్వడంతో ఈ రోజు ఇంతటి స్థానానికి వచ్చాను. మాది ఆదిలాబాద్ పట్టణం. నాన్న రిటైర్డ్ ఉద్యోగి పుండరిక్ ఉప్రే, తల్లి కిరణ్ బాల. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ఆదిలాబాద్‌లో చదివి హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగం వల్ల ప్రజలకు సేవ చేసే అదృష్టం లభిస్తుందన్న నాన్న సూచన మేరకు కాంపీటీటివ్ పరీక్షలు రాసి రెవెన్యూలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సంపాదించాను. ప్రస్తుతం రెవెన్యూలో ఇంచార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. – ఇన్‌చార్జి తహసీల్దార్ జ్యోత్స్న

జ్ఞాపకార్థం సేవలో..

మంచిర్యాలఅర్బన్: బతుకు బాట నేర్పిన తండ్రి శాశ్వతంగా దూరమైనా ఆ జ్ఞాపకాలను పదిలం చేస్తూ సేవ చేస్తున్నాడు ఓ తనయుడు. పాత మంచిర్యాలకు చెందిన దుర్గ పోశం కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టడం.. తోచిన విధంగా సేవలందిస్తూ 2007లో మృతిచెందాడు. అప్పటి నుంచి పేదలకు ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో తనయుడు దుర్గం రాజేశ్ తన తండ్రి జ్ఞాపకార్థం దుర్గం పోశం ట్రస్టు ఏర్పాటు చేశాడు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ, ఆర్థిక సహాయం అందించారు. రాళ్లపేట్‌లో ఆలయ నిర్మాణానికి స్థలం అందజేశారు. యూఆర్ఎస్ స్కూల్‌లో 40 మంది పిల్లలకు యూనిఫాంలు, నిరుపేదలకు కంటి ఆపరేషన్లు చేయించాడు. క్రీడాకారులు, కళాకారులకు అవసరమైన టీషర్టులు, ఇతర విరాళాలు అందిస్తూ సేవానిరతిని చాటుకుంటున్నాడు.



విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న దుర్గం రాజేశ్(ఫైల్)

మంచిర్యాలటౌన్: తండ్రి నల్ల లక్ష్మయ్య 2002లో, తల్లి నల్ల కోటమ్మ 2003లో చనిపోయారు. వారిద్దరి పేరిట 2011లో నల్ల కోటమ్మ, నల్ల లక్ష్మయ్య మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేసి తనయుడు నల్ల శంకర్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మృతదేహాలు శ్మశానవాటికకు తరలించేందుకు వైకుంఠరథం, మృతదేహాలు భద్రపర్చేందుకు బాడీ ఫ్రీజర్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు.

'ఎన్నికల' బదిలీలు

- పోలీసు, రెవెన్యూ శాఖల్లో అధికం
- జిల్లాలో ట్రాన్స్‌ఫర్ల హడావుడి షురూ



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులకు బదిలీ అనివార్యమైంది. వచ్చే శాసనసభ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా రాష్ట్రంలో ఒకే చోట ఎక్కువ కాలం పని చేస్తున్న అధికారులను ట్రాన్స్‌ఫర్ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో జిల్లాలో అధికారుల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల నిర్వహణలో ప్రథమంగా ఉండే పోలీసు, రెవెన్యూతోపాటు ఇతర శాఖల్లోని అధికారులకు స్థాన చలనం కలుగనుంది. దీంతో కొత్త పోస్టింగ్‌ల కోసం పైరవీలు, ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి మళ్లీ వచ్చేందుకు అధికారులు సిఫారసులు సంపాదించుకుంటున్నారు. ఇప్పటికే ఒకే డివిజన్‌లో పని చేస్తున్న సీఐలు, ఎస్సైలు బదిలీ అవుతున్నారు. వేర్వేరు జిల్లాల్లో జరుగుతున్న బదిలీలు సైతం ఇక్కడున్న వారి ట్రాన్స్‌ఫర్లకు కారణమవుతున్నాయి.

మూడేళ్లు దాటితే..

వచ్చే జనవరిలో ప్రస్తుతం ప్రభుత్వ కాలపరిమితి ముగిసిపోతుంది. వచ్చే జనవరి 31నాటికి మూడేళ్లుగా జిల్లాలో పని చేస్తున్న గెజిటెడ్ స్థాయి అధికారులకు బదిలీ కానుంది. ఇక ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు, రెవెన్యూ, అధికారులే అధికంగా వేరే చోటుకు వెళ్లాల్సి వస్తుంది. మూడేళ్లు పూర్తవుతున్న అధికారుల జాబితా సిద్ధమైంది. ఇందులో ఎస్సై నుంచి ఉన్నత స్థాయి వరకు బదిలీ జరగొచ్చు. ఈ బదిలీలన్నీ వచ్చే నెల 31లోపు పూర్తి చేయాలి. జిల్లాలో 26 పోలీసుస్టేషన్లు, 12 సర్కిళ్లు ఉన్నాయి. వీరితోపాటు సొంత జిల్లాలోనే కొంతకాలంగా పని చేస్తున్న అధికారులను సైతం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీ చేయాల్సి ఉంది. కొందరు అధికారులు బదిలీలను తప్పించుకుని ఇక్కడే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కుదరకపోతే పక్క జిల్లాలోనే పోస్టింగ్ తెచ్చుకునేందుకు కూడా పైరవీలు చేసుకుంటున్నారు.

ఉన్నతాధికారులు లేరు

జిల్లా శాఖాధిపతులు మూడేళ్లు పూర్తి చేసుకున్న వారందరికీ ఎన్నికల సంఘం ఆదేశాలు వర్తించనున్నాయి. ప్రస్తుత కలెక్టరు, అదనపు కలెక్టర్లు, డీసీపీ, ఇతర జిల్లా ఉన్నతాధికారులకు జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి కాలేదు. దీంతో ఆదేశాలు వర్తించకపోవచ్చు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వమే ఉన్నతాధికారులను బదిలీ చేస్తే తప్ప ప్రస్తుతమున్న వారే వచ్చే ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించే అవకాశం ఉంది.

రెవెన్యూలో భారీగా..

పోలీసు శాఖ తర్వాత రెవెన్యూ శాఖ నుంచే అధికంగా బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 18మండలాలు, మంచిర్యాల, బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో పని చేస్తున్న వారితో కలిపి 25మంది వరకు తహసీల్దార్లు ఉన్నారు. వీరిలో అధిక భాగం మూడేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్నవారే ఉన్నారు. కొత్త సర్వీసు నిబంధనల ప్రకారం తహసీల్దార్ మల్టీ జోనల్ కేడర్ పోస్టు కావడంతో రాష్ట్రంలో ఏ జోన్‌కైనా బదిలీ చేసే అవకాశం ఉంది. మరోవైపు కొందరు సొంత జిల్లాకు చెందిన వారు ఉన్నారు. ఆ అధికారులను ఎన్నికల సమయంలో తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. ఎన్నికల సమయంలో స్థానికంగా ఉన్న పరిచయాలు, ఓటింగ్‌లో ప్రభావితం చేస్తారనే కారణంతో అధికారులను బదిలీ చేస్తుంది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడే పని చేయాల్సి వస్తే, తమ బంధువులు, పరిచయస్తులు ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయడం లేదనే ప్రమాణపత్రం ఎన్నికల సంఘానికి ఆ అధికారి అందజేయాల్సి ఉంటుంది.

ఘనంగా గిరిజన దినోత్సవ వేడుకలు



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హాజీపూర్ మండలంలోని గిరిజన గ్రామాలైన గఢ్‌పూర్, చిన్నగోపాల్‌పూర్, ర్యాలీ, నాగారం గ్రామాల్లో శనివారం గిరిజన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు గిరిజన సంప్రదాయాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముగ్గురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. గిరిజన గ్రామాల పూజారులు, గ్రామపెద్ద పటేళ్లను సత్కరించారు. రూ.20 లక్షలతో నాగారం గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ, గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. చిన్నగోపాల్‌పూర్ గ్రామంలో రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ, రూ.2 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.2.50 లక్షలతో ర్యాలీలో గ్రంథాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ, రూ.4 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గఢ్‌పూర్‌లో రూ.4 లక్షలతో అంగన్‌వాడీ భవన ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచులు సోనేరావు, రాజు, లక్ష్మి, భీంభాయి, ఎంపీటీసీ అనూభాయి, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, ఎంపీపీ కో ఆప్షన్ రఫిక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోపతి లస్మయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శిశువును 'అమ్మే'యాలనుకుంది..!

- మహిళతో కలిసి అమ్మకానికి బేరం
- ఎంసీహెచ్ ఆస్పత్రిలో ఘటన
- జిల్లా బాలల సంరక్షణ అధికారులకు శిశువు అప్పగింత



ఎంసీహెచ్‌లో విచారణ చేస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం నుంచి నవజాత శిశువును బ్రోకర్ ద్వారా అమ్మేందుకు తల్లి చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు అందడంతో శిశువు అమ్మకాన్ని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 12న ప్రసవం కోసం మహిళ మంచిర్యాలలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. 13న ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవానికి వచ్చిన సమయంలో తప్పుడు పేరు చెప్పడంతోపాటు ఆధార్‌కార్డు ఇవ్వాలని చెప్పినా ఇవ్వకుండా, నొప్పులు వస్తున్నాయంటూ హడావుడి చేసింది. ఆడశిశువుకు జన్మనిచ్చిన తర్వాత అప్పటికే తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, పుట్టిన బిడ్డను బెల్లంపల్లికి చెందిన మరో మహిళా బ్రోకర్ సాయంతో అమ్మకానికి పెట్టినట్లు సమాచారం. రూ.5 లక్షలకు హైదరాబాద్‌కు చెందిన వారితో బేరసారాలు చేసుకున్నారు. వారు ఆసుపత్రికి వచ్చి శిశువును చూసుకునే క్రమంలో ఆసుపత్రి సిబ్బంది గుర్తించి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. తల్లీబిడ్డలను ఐసీడీఎస్ అధికారులు అదుపులోకి తీసుకుని, విచారించగా ముగ్గురు పిల్లలను పోషించడం తనతో కాదని, అందుకే ఇతరులకు ఇద్దామని అనుకున్నానే గాని, అమ్మాలని అనుకోలేదని తెలిపింది. దీంతో శిశువును శనివారం ఆదిలాబాద్‌లోని బాల రక్షణ భవనానికి తరలించినట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్ తెలిపారు.

'వలసవాదులకు కాంగ్రెస్ టికెట్ ఇస్తే ఓడిస్తాం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: కాంగ్రెస్ టిక్కెట్ వలసవాదులకు కేటాయిస్తే చిత్తుగా ఓడిస్తామని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల శ్రేణులు ముక్తకంఠంతో హెచ్చరించారు. శనివారం పట్టణ కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ముఖ్య నాయకులు, మండలాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులు శ్రేణులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి స్థానికులకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి వినోద్ స్థానికంగా నివాసం ఉండడం లేదని, నాయకులు, కార్యకర్తల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ఆయనకు పార్టీ అధిష్ఠానం టిక్కెట్ ఇవ్వవద్దని స్పష్టం చేశారు. టిక్కెట్ ఇస్తే వ్యతిరేకంగా పని చేస్తామని అల్టీమేటం జారీ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి టి.మల్లేష్, మాజీ ఎమ్మెల్యే ఎ.శ్రీదేవి, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండి ప్రభాకర్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు గెల్లి జయరాం, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్‌రాజు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, నాయకులు నాతరి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి నార్లాపూర్ సమీపంలోని అడిచెర్ల ఓదెలుకు చెందిన వ్యవసాయ బావిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం బావిలో మృతదేహాన్ని గమనించిన ఓదెలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. సుమారు వారం, పది రోజుల క్రితం చనిపోయి ఉంటాడని, మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉందన్నారు. సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, నీలం రంగు జీన్ ప్యాంటు, వంకాయ రంగు షర్ట్ వేసుకున్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు మందమర్రి ఎస్సై 8712656570, సీఐ 8712656569 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఓదెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో బాలిక మృతి


మహేశ్వరి (ఫైల్)

సిర్పూర్(టి): వడదెబ్బతో బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని చీలపెల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లెండుగురె సోమయ్య కుమార్తె మహేశ్వరి(8) వడదెబ్బకు గురికావడంతో రెండు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతోంది. సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారు జామున మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

హన్మాన్‌బస్తీలో చోరీ

- యజమాని ఇంట్లో ఉండగానే ఘటన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీలోని ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన కోట నాగరాజు ప్రైవేట్ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని భార్య, పిల్లలు శుక్రవారం ఉదయం జమ్మికుంటకు వెళ్లారు. పనికి వెళ్లిన నాగరాజు రాత్రి ఇంటికి వచ్చి భోజనం అనంతరం ఇంటికి తాళం వేసి పడుకున్నాడు. శనివారం తెల్లవారు జామున లేచి చూసేసరికి ఇంటితాళం పగుల గొట్టి ఉంది. గదిలోకి వెళ్లి బీరువాను తెరిచిచూడగా అందులో ఉన్న 2 తులాల బంగారం, 17 తులాల వెండి, రూ.30 వేల నగదు అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎస్‌ఎల్‌ఎఫ్‌లో మోసాలకు పాల్పడిన మహిళ అరెస్టు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని వాసవి ఎస్‌ఎల్‌ఎఫ్(స్లమ్ లెవల్ ఫెడరేషన్)లో జరిగిన మోసాలకు కారకురాలైన కె.అనితను శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పట్టణ సీఐ బుద్దె స్వామి తెలిపారు. సిర్పూర్ (టి) మెజిస్ట్రేట్ జూన్ 28 వరకు రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

- ఒక్కొక్కరిది ఒక్కో రికార్డు
- పాటలు.. శ్లోకాలు.. భజనలు..
- ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో మనోళ్లు

వండర్‌ఫుల్ రికార్డులు

మనకు తెలిసిన రెండు మూడు భాషల్లో పాటలు పాడగలం.. కానీ 17 భాషల్లో పాడితే అదో రికార్డు. తక్కువ సమయంలో 186 దేశాల కరెన్సీ గుర్తిస్తే మరో రికార్డు.. బుల్ బుల్ సితార్ నిర్విరామంగా వాయిస్తే ఇంకొక రికార్డు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో. కాదేది రికార్డుకు అనర్హం. అన్ని రికార్డుల సమాహారమే ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు. ఏదైనా ఒక రికార్డు సాధించాలంటే కృషి.. పట్టుదల.. నిరంతర సాధన.. లక్ష్యంపై గురి ఉండాల్సిందే. అలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన చాలామంది ఒక్కో అంశాన్ని ఎంచుకుని రికార్డు సాధించి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో తమ పేరు పదిలం చేసుకున్నారు. వీరిలో కొందరిపై ప్రత్యేక కథనం.

– సాక్షి, మంచిర్యాలడెస్క్


అష్యత్‌కు రికార్డు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు(ఫైల్)

సండే స్పెషల్

- మంచిర్యాలకు చెందిన ప్రముఖ బుల్‌బుల్ సితార్ కళాకారుడు చుంచు గురువయ్య విరామం లేకుండా ఏడు గంటలపాటు బుల్ బుల్ సితార్ వాయించినందుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు అందుకున్నారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని బూర్ల పవన్‌కుమార్ ఏడు గంటలపాటు నిర్విరామంగా డోలక్, భజన పాటల ద్వారా రికార్డు సృష్టించాడు.
- మంచిర్యాలకు చెందిన నామని వెంకట ఆద్విక 189 దేశాల పేర్లు, కరెన్సీని గుర్తిస్తుంది. నాలుగు నిమిషాల్లోనే గుర్తించడం ద్వారా రికార్డుకెక్కింది.
- మంచిర్యాలకు చెందిన కొమ్మెర విశ్వేశ్వర వర్మ జ్యోతిష్య, వాస్తు సలహాదారు. శ్రీదేవి ఉపాసకులైన ఆయన లలిత పారాయణాన్ని 108మంది సభ్యులు, 108 రోజులు, 108 ఇళ్లలో నిర్వహించారు. లలిత సేవా సమితి పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా రికార్డు సాధించారు.
- మంచిర్యాలకు చెందిన విద్యార్థులు వేనంపల్లి వేదాంత్ సాయి, సిద్ధాంత్ సాయి 75రకాల విత్తనాలు.. ఒక్కో రకంతో ఒక్కో భారతదేశం పటం .. ఇలా 75 భారతదేశ చిత్రపటాలను రూపొందించారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేసిన ఈ ప్రయత్నం ద్వారా రికార్డుకెక్కారు. గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.
- మంచిర్యాలలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో రంగస్థలం కార్యక్రమం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కట్ల భాగ్యలక్ష్మి 24గంటల 24 నిమిషాల 24 సెకన్లు ప్రాచీన కళలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, స్టేజీ డ్రామాలు నిరంతరాయంగా ప్రదర్శించారు. 2022 జూన్ 4, 5వ తేదీల్లో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా రికార్డు సొంతం చేసుకున్నారు. మొదటిసారిగా వెయ్యి మంది కళాకారులను సన్మానించారు.
- నిర్మల్‌లోని బాగులవాడకు చెందిన అల్లం నవీన్ వరి విత్తనాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటం తయారు చేశాడు. ఆరు వేల విత్తనాలు వినియోగించి ఒక్కో దానిపై కేసీఆర్ అనే పదాలు రాశాడు. ఇది పూర్తి చేయడానికి ఐదు నెలల సమయం పట్టింది. పేదలకు బియ్యం పంపిణీ, హరితహారం పథకాలను స్ఫూర్తి పొంది రూపొందించాడు.
- ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బెల్లంపల్లి బ్రాంచి ఆధ్వర్యంలో దుర్గాదేవి నిజరూప ప్రదర్శన నిర్వహించారు. 108 మంది దుర్గామాత వేషధారణలో ఆకట్టుకున్నారు. గత ఏడాది అక్టోబర్ 4న జరిగిన కార్యక్రమంలో ఒకే వేదిక ద్వారా దుర్గాదేవి వేషధారణతో రికార్డుకెక్కారు.
- మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గృహిణి వేముల మానస 150 నిమిషాల్లో 2,800 శ్లోకాలు పఠించి రికార్డు సృష్టించారు. నిరంతరాయంగా మూడు గంటలపాటు ప్రవచనాలు చెప్పగలుగుతారు. రామాయణానికి సంబంధించిన ప్రవచనాలపై ఆమెకు గొప్ప అవగాహన ఉంది. శ్లోకాలు కంఠస్థం చేయడానికి ఆమెకు ఎనిమిదేళ్ల సమయం పట్టింది.
- మంచిర్యాలకు చెందిన కట్టోజి జాహ్నవి 17భాషల్లో పాటలు పాడగలదు. తెలుగు పద్యాలు, డైలాగ్‌లు చెప్పగలదు. తెలుగు, తమిళం, కన్నడ, ఉర్దూ తదితర భాషల్లో పాటలు పాడి రికార్డు సృష్టించింది. రికార్డు తర్వాత ఆమె మరో మూడు భాషల్లోనూ ప్రావీణ్యం సాధించింది.

చిన్నారులు భళా..

మంచిర్యాలకు చెందిన చీకోటి శ్రేయాంక్ 150 దేశాల జెండాలను అలవోకగా గుర్తిస్తాడు. ఇండియా, చైనా, భూటాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల జాతీయ పతాకాలను 60 సెకండ్లలో గుర్తించడం ద్వారా రికార్డు దక్కింది.

- ఆదిలాబాద్‌కు చెందిన రిమ్‌షా ఫిర్దోస్ అద్భుత జ్ఞాపకశక్తితో అబ్బురపరుస్తోంది. 86 దేశాల రాజధానులను నిమిషంలో, 29 రాష్ట్రాల రాజధానులను 16సెకండ్లలో, 800 జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంది. 2016 జూన్ 7న ఆదిలాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తన ప్రతిభతో రికార్డు సృష్టించింది.
- మంచిర్యాలకు చెందిన అకినపల్లి శర్మిష్ఠ అష్యత్ బహుముఖ ప్రజ్ఞ ద్వారా బ్లైండ్ పోల్ విభాగంలో రికార్డు సృష్టించాడు. కళ్లకు గంతలు కట్టుకుని చేతితో తాకడం ద్వారా అంకెలు, కరెన్సీ నోట్లు, గుర్తించడం, క్యూబ్‌ను ఏదైనా ఒక వైపు కలర్‌ను పూర్తి చేయడం చేస్తాడు.

జీవితంలో మరిచిపోలేను..



కోమటిచేను సాయిబాబా ఆలయంలో నిర్విరామంగా బుల్ బుల్ సితార్ వాయించాను. బుల్ బుల్ సితార్ అనేది పురాతన వాయిద్యం. నాకు 21ఏళ్లు ఉన్నప్పటి నుంచి వాయించడం మొదలు పెట్టాను. గత 40 ఏళ్లుగా ఉచితంగానే ప్రదర్శనలు ఇస్తున్నాను. ఆలయాల్లో కొందరితో కలిసి వందలాది భజనలు చేశాను. స్టార్ మేకర్‌లో వెయ్యి వరకు పాటలు పాడాను. సింగరేణిలో పని చేస్తున్న సమయంలో కోలిండియా స్థాయి పోటీల్లో పదిహేను సార్లు బహుమతి పొందాను. ఆలయంలో ఏడు గంటలు నిర్విరామంగా బుల్ బుల్ సితార్ వాయించడం ద్వారా రికార్డు సృష్టించాను. నా జీవితంలో మరిచిపోలేను. గవర్నర్ తమిళిసై చేత ప్రశంసలు పొందాను.

– చుంచు గురువయ్య, బుల్ బుల్ సితార్ కళాకారుడు

బోధన మారథాన్

మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన నేరెళ్ల శ్రీధర్‌గౌడ్ 30 గంటల బోధన మారథాన్ నిర్వహించడం ద్వారా రికార్డు సృష్టించాడు. 2016లో వరంగల్‌లోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. 'ప్రిన్సిపుల్స్ ఇన్ డ్రగ్ కెమిస్ట్రీ అండ్ అనలైటికల్ టూల్స్' అంశంపై బోధన చేశాడు. అనుబంధంగా నాలుగు అంశాలపై సాగిన బోధన 2016లో మార్చి 21న ఉదయం 11గంటలకు ప్రారంభమై మరుసటి రోజు సాయంత్రం ఐదు గంటల వరకు సాగింది.

వాల్మీకి రామాయణం ప్రవచనమే లక్ష్యం



వాల్మీకి రామాయణాన్ని అమితంగా ఇష్టపడతాను. స్వతహాగా నేను భక్తురాలిని. రాముడిపై ఉన్న మమకారంతో రామాయణంలోని శ్లోకాలను నేర్చుకోవాలని ప్రయత్నించాను. ఇప్పటివరకు మూడు వేల పైచిలుకు శ్లోకాలు నేర్చుకున్నాను. 2,800 శ్లోకాలను రెండున్నర గంటల వ్యవధిలో ప్రవచించడంతో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో నాకు స్థానం దక్కింది. ఏడు ఖండాలుగా ఉన్న వాల్మీకి రామాయణాన్ని కంఠస్థం చేసి ప్రవచించడమే నా అంతిమ లక్ష్యం. భర్త శ్రీనివాస్, కుటుంబ సభ్యుల తోడ్పాటు ఎంతగానో ఉంది.

– వేముల మానస, బెల్లంపల్లి

సమాజంలో ప్రత్యేక గుర్తింపు



ఈ రికార్డుల వల్ల సమాజంలో ప్రత్యేక ప్రతిభతో గుర్తింపు లభిస్తుంది. ఏదైనా ఒక విద్యలో నిష్ణాతులుగా ఉండి.. ఎవరూ చేయనిది.. మనకంటూ ప్రత్యేకత కలిగిన వాటిని ఎంచుకుని పరిపూర్ణంగా ప్రదర్శిస్తే చరిత్రలో ఒక రికార్డుగా నిలిచిపోతుంది. భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయి. మనకు వచ్చే అవార్డులు, రికార్డులు సాక్ష్యంగా నిలుస్తాయి. యోగా డే రోజు మరో రెండు రికార్డులు నమోదు చేయనున్నాం. 108 సూర్యనమస్కారాలు, 108 రోజులు చేసిన వారికి ఇవ్వనున్నాం. వంద మందితో 108 ఆసనాలు వేయిస్తాం. పాటలు పాడడం, నృత్యం ఇలా ఏ కళలో అయినా ఇదివరకు ఎవరూ చేయనివి చేయగలం అనుకుంటే వండరబుక్ ఆఫ్ రికార్డు వెబ్‌సైట్ ద్వారా సంప్రదించవచ్చు. రికార్డు నమోదు అనేది 170 దేశాల్లో కొనసాగుతోంది.

– డాక్టర్ జ్యోతి రంగ, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు సౌత్ ఇండియా కోఆర్డినేటర్

'హక్కులకోసం పోరాడే నేతలను కించపర్చడం సరికాదు'


మాట్లాడుతున్న నాయకులు

పాత మంచిర్యాల: సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులను ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య తొట్టిగ్యాంగ్‌లు అని కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని సంఘం రాష్ట్ర కో కన్వీనర్ నీరటి రాజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవి సత్యం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జైపాల్‌సింగ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో రిజిస్టర్ అయిన సంఘాలకు యాజమాన్యంతో సంప్రదింపులు జరిపే అవకాశం కల్పించాలని ఆర్‌ఎల్‌సీ ముందు సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రతిపాదనలు పెట్టారని, ఇది జీర్ణించుకోని సీతారామయ్య విప్లవ కార్మిక సంఘాలను తొట్టిగ్యాంగ్‌గా ప్రచారం చేస్తూ యాజమాన్యం మెప్పు పొందే ప్రయత్నం చేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీలో ఉండి మిత్ర సంఘాలను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గొడిశెల శ్రీహరి, వెంగల కనకయ్య, ఎంఎఫ్ బేగ్ పాల్గొన్నారు.

డాక్టర్స్ సెల్ వైస్ చైర్మన్‌గా 'దాసారపు'


శ్రీనివాస్

మందమర్రిరూరల్(చెన్నూర్): టీపీసీసీ అనుబంధ విభాగం డాక్టర్స్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దాసారపు శ్రీనివాస్‌ను నియమిస్తూ సెల్ రాష్ట్ర చైర్మన్ గొట్టిముక్కల విశ్వతేజేశ్వరరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో రిటైర్డు కార్మికుడు మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని హన్మాన్‌బస్తీకి చెందిన ఓ సింగరేణి రిటైర్డు కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ కార్మికుడు రెమ్మ కృష్ణ (58)ఇటీవల ఉద్యోగ విరమణ పొందాడు. అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. శనివారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇరుగు పొరుగువారు వచ్చి కిటికీలోంచి లోపలికి తొంగిచూడగా రక్తం మడుగులో మృతి చెంది కనిపించాడు. ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడ్డాడా? లేదా మరేదైనా కారణమా? అనేది తేలాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తులో కానీ పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

దశాబ్ద కాలం క్రితమే...

మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భర్తతో గొడవపడి దశాబ్దం క్రితమే భార్య లావణ్య కూతుర్ని వెంటతీసుకుని జగిత్యాల జిల్లాలో ఉన్న పుట్టింటికి వెళ్లిపోయింది. కొన్నాళ్ల క్రితమే కుమారుడు ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. అతనికి మద్యం అలవాటు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

డిగ్రీ పరీక్షల్లో 23 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన 23 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ నరేందర్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెన్నూర్‌లో ఇద్దరు, ఇచ్చోడలోని సాయి సమత్ డిగ్రీ కళాశాలలో ఎనిమిది మంది, కాకతీయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఛత్రపతి డిగ్రీ కళాశాలలో ఆరుగురు, మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాలలో నలుగురు డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

పరీక్ష ఆసిఫాబాద్‌లో.. చిరునామా కెరమెరి

- అధికారుల తప్పిదంతో విద్యార్థినికి ఇబ్బందులు
- హెచ్‌ఎం సమయస్ఫూర్తితో 'పది' పరీక్షకు హాజరు


స్వాతితో మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి(ఆసిఫాబాద్): అధికారుల తప్పిదం ఓ విద్యార్థినిని ఇబ్బందులకు గురిచేసింది. పరీక్ష ఒక చోట.. చిరునామా మరో చోట ఉండడంతో ఆందోళనకు గురైంది. రెబ్బెన మండల కేంద్రంలోని కేజీబీవీలో చదువుతున్న జాబరి స్వాతి ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్షల్లో గణితంలో ఫెయిలైంది. సప్లిమెంటరీలో పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లించింది. ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(పీటీజీ)లో శనివారం(17న) గణిత పరీక్ష రాయల్సి ఉంది. హాల్ టికెట్‌లో టీఎస్ టీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (పీటీజీ) కెరమెరి, ఆసిఫాబాద్ అని ఉంది. దీంతో ఆ విద్యార్థిని ఉదయం నేరుగా కెరమెరికి చేరుకుంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి పరీక్ష కేంద్రం చిరునామా గురించి వాకబు చేసింది. కానీ ఆ పాఠశాల కెరమెరిలో లేదని, ఆసిఫాబాద్‌లో ఉందని తెలియడంతో ఆందోళన చెందింది. స్పందించిన కెరమెరి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆడే ప్రకాశ్ సమయస్ఫూర్తితో హుటాహుటిన ఆటోను పిలిపించి సదరు విద్యార్థిని ఆసిఫాబాద్ పీటీజీకి పంపించారు. ఆలోగా జిల్లా ఉన్నతాధికారులకు విషయం చెప్పడంతో పరీక్షకు అనుమతించారు. వాస్తవానికి ఆసిఫాబాద్‌లో ఉన్న పీటీజీ పాఠశాల 25 ఏళ్ల క్రితం కెరమెరికి మంజూరైంది. కానీ ఇక్కడి నాయకులు పాఠశాల గదుల నిర్మాణానికి స్థలం చూపెట్టక పోవడంతో ఆసిఫాబాద్‌కు తరలించారు. దీంతో ఇప్పటికీ ఆపాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు, సిబ్బంది ముందు కెరమెరికి రావడం గమనార్హం.

సమ్మెకాలపు ఒప్పందాలు అమలుచేయాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన 18 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. శనివారం కైరిగూడ ఓసీపీలో ఏర్పాటు చేసిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనస్, ఈఎస్ఐని వెంటనే అమలు చేయాలని, కోలిండియాలో మాదిరి కార్మికులకు రూ.1,042 చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం జీవో 22 వెంటనే గెజిట్ చేసి కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జూన్ 17 నుంచి జులై 22 వరకు వివిధ రూపాల్లో పోరుబాట చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ర్యాలీలు, ప్రజాప్రతినిధులకు మెమోరాండాలు, కలెక్టరేట్, జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు, నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో ట్రాలీ

బెల్లంపల్లి:బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును పాతబస్టాండ్ సమీపంలో శనివారం ఓ ఆటో ట్రాలీ ఢీకొట్టింది. అప్రమత్తమైన ఆర్టీసీ డ్రైవర్ బస్సును ఆపడంతో ఆటో ట్రాలీ ఫుట్‌పాత్ వద్ద అతుక్కుపోయింది. అదృష్టవశాత్తు ఫుట్‌పాత్ వద్ద ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బజారు ఏరియా ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. బైక్‌లపై యువకులు గాలిలో తేలిపోతుండగా నిత్యావసర వస్తువులు రవాణా చేస్తున్న వ్యాన్‌లు, లారీలు, మద్యం బాటిళ్లు తీసుకువచ్చే వాహనాలు ఇష్టారాజ్యంగా రోడ్డుపై నిలిపి ఉంచి ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నారు. వీటిని నియంత్రించడానికి పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని పుర ప్రజలు ఆరోపిస్తున్నారు.

లా పట్టభద్రులకు శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన లా పట్టభద్రులు అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడేళ్ల శిక్షణ పొందేందుకు గానూ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఉప సంచాలకులు పి.రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 30లోగా ఆన్‌లైన్‌లో ఈ–పాస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94418 74738 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రాపల్లిలో చోరీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాపల్లిలో నివాసం ఉంటున్న శంకరయ్య సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. ఈ నెల 13న తన భార్య, కుమార్తెలతో కలిసి శ్రీరాంపూర్‌లో నివాసం ఉంటున్న కుమారుడి ఇంటికి వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. వెంటనే లోపలికి వెళ్లి చూడగా బీరువా పగుల గొట్టి బట్టలన్నీ చిందరవందర చేసి ఉన్నాయి. బీరువాలో ఉంచిన రూ.10 వేల నగదు కనిపించలేదు. బాధితుడు శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఐసీడీఎస్ నిర్వీర్యానికి కుట్ర'


మాట్లాడుతున్న పి.జయలక్ష్మి

పాతమంచిర్యాల: ఐసీడీఎస్‌లను నిర్వీర్యం చేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి ఆరోపించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన జీపుజాతా శనివారం జిల్లా కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి సునీత, భానుమతి, రాజమణి, సువర్ణ, దుంపల రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే భగవత్ దర్శనం

చెన్నూర్: ఆధ్యాత్మిక చింతనతోనే భగవత్ దర్శనం లభిస్తుందని శృంగేరి శివగంగ పురుషోత్తమ భారతిస్వామి అన్నారు. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా శనివారం చెన్నూర్ శివాలయానికి చేరుకున్నారు. అర్చకులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం ఆలయాలు సందర్శిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేదపండితులు గట్టు నరహరిశర్మ, ఆగస్త్యాశర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం సాధ్యమైనంత వరకు తగ్గించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని ఏరియాలో సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. స్వచ్ఛపక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం ఉద్యోగులకు జనపనార సంచులను పంపిణీ చేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఏరియాలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు, నిత్యావసర సరుకుల కోసం కిరాణ దుకాణాలకు వెళ్లే సమయంలో ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నాయంగా బట్ట, జనపనార సంచులను తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మ ణరావు, డీవైపీఎం తిరుపతి, జూనియర్ ఫారెస్టు అధికారి నవీన్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ One year 10th,inter,NIOS,TOSS, APOSS, Degree&PG, Year Wise Nagarjuna, SV University guidelines for B.Tech, Detained,Failed Students Cont: NICC KPHB Hyd. Ph: 9515390685, 8179882462 [H-788704]

REAL ESTATE
LAND FOR SALE

■ For Sale 163 Acres Single-bit Prime Land, Clear Title, Road-Facing, Close to Vijayawada - Nagpur Express way, Excellent Environment for Living, Business and Agriculture, High Iron Soil. Nawabpet (V), Chityala (M), Bhupalpally (D), Contact: 7675868777, 7207314277, info@amodagroup.com [HA-26811]

SERVICES
జ్యోతిష్యాలయం

■ శ్రీ కనకదుర్గ జ్యోతిష్యాలయం ఫోన్ ద్వారానే ఉచితంగా చెప్పబడును. విద్య ఉద్యోగం ఆరోగ్యం వ్యాపారం సంతానం ఎటువంటి సమస్యలు ఉన్న శాస్త్రి గారు తొమ్మిది రోజుల్లో శాశ్వత పరిష్కారం చెప్పబడును. సెల్: 9959792916 [1217056]

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్:9310515624, 8800496710. [DA-37247]

www.sakshi.com

WANTED

■ చెన్నై అసురస్ సోపు, డిటర్జెంట్ పౌడర్ అన్ని రకాల లిక్విడ్లను ఏ.పి.& తెలంగాణ వ్యాప్తంగా విక్రయించడానికి ఏరియాల వారిగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. 73965 77077. [T-149]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, భార్యా-భర్తలు, డ్రైవర్స్,సాయి మందిరములో పూజారి కావలెను. ఫోన్ : 9391036931, 9246585901. [HA-11235]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర।। 9391912949, 040-40123376. [H-788703]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793440]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,